ప్రజాశక్తి

శుక్రవారం 11 అక్టోబర్ 2024

5

అల్లూరి సీతారామరాజు

డిపిఒగా లవరాజు

ప్రజాశక్తి -పాడేరు: అల్లూరి సీతారామరాజు జిల్లా పంచాయతీ అధికారిగా బి.లవరాజు గురువారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. శ్రీకాకుళం డ్వామాలో విజిలెన్స్ అధికారిగా పనిచేస్తూ, సాధారణ బదిలీలలో అల్లూరి జిల్లా డిపిఒగా నియమితులయ్యారు. విధుల్లోకి చేరిన ఆయనను డివిజనల్ పంచాయతీ అధికారి పిఎస్.కుమార్, కార్యాలయ సిబ్బంది ఘన స్వాగతం పలికారు. కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు శుభాకాంక్షలు తెలిపారు.

డిపిఒ లవరాజును అభినందిస్తున్న డిఎల్‌పిఒ

సామాజిక భవనం ప్రారంభం

సామాజిక భవనాన్ని ప్రారంభిస్తున్న జెడ్‌పిటిసి గంగరాజు, ఎంపిపి నీలవేణి

ప్రజాశక్తి -అనంతగిరి : మండలంలోని అనంతగిరి పంచాయతీ లక్ష్మీపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన సామాజిక భవనాన్ని గురువారం ఎంపిపి శెట్టినీలవేణి, జెడ్‌పిటిసి దీసరి గంగరాజు ప్రారంభించారు. స్థానిక సర్పంచ్ సోమ్మెల రూతు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ, అనంతగిరి పంచాయతీ పరిధిలోని గ్రామాల అభివృద్ధి ప్రత్యేక దృష్టి పెట్టి, జిల్లా, మండల పరిషత్ నిధులను కేటాయిస్తున్నట్లు వెల్లడించారు. మారుమూల గ్రామాల్లో మౌలిక వసతులు కల్పనకు జిల్లా కలెక్టర్, ఐటిడిఎ పిఒల దృష్టికి తీసుకెళ్తున్నట్లు వెల్లడించారు. సర్పంచ్ రూతు మాట్లాడుతూ గ్రామస్తులు కోరిక మేరకు రూ.మూడు లక్షల 15వ ఆర్థిక సంఘం నిధులతో గ్రామంలో సామాజిక భవనం ఏర్పాటుచేశామన్నారు. అలాగే రేగం, మొండిజామగుడ గ్రామాల్లో రచ్చబండలతోపాటు తాగునీటి సౌకర్యం కల్పించామన్నారు కార్యక్రమంలో ఎగువశోభ పంచాయతీ సర్పంచ్ కొర్రా. సింహాద్రి, ఉప సర్పంచ్ పాంగి అర్జున్, వార్డు మెంబర్లు జన్ని సుబ్బారావు, సిఎస్ వెంకటరావు జన్ని బుజ్జి, పంచాయతీ సెక్రటరీ శ్రీనివాసరెడ్డి, బాలకృష్ణ, గిరిజన సంఘం మండల నాయకులు సోమ్మెల, నాగులు, ఎస్ చిన్నంగులు, గ్రామస్తులు జన్ని అప్పారావు, జె.గంగరాజు తదితరులు పాల్గొన్నారు

జలజీవన్ మిషన్ కూలీలకు డబ్బులు చెల్లించని కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

నినదిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: మండలంలోని కుసుమవలస గ్రామంలో జలజీవన్ మిషన్ పథకంలో మంచి నీటి ట్యాంక్ నిర్మాణ పనుల్లో పాల్గొన్న కూలీలకు ఏడాదిన్నర గడిచినా డబ్బులు చెల్లించని కాంట్రాక్టర్ ప్రభాకర్‌పై చర్యలు తీసుకోవాలని సిపిఎం మండల ప్రధాన కార్యదర్శి ఎస్‌బి పోతురాజు డిమాండ్ చేశారు. గురువారం కించుమండ పంచాయతీ కుసుమవలస గ్రామంలో సిపిఎం శాఖ సమావేశం నిర్వహించారు. ముందుగా పార్టీ జాతీయ ప్రధానకార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పోతురాజు మాట్లాడుతూ కుసుమవలస గ్రామంలో సుమారు ఏడాదిన్నర క్రితం జలజీవన్ మిషన్ పథకం ద్వారా గ్రావిటీ నిర్మాణ పనులు ప్రారంభించారన్నారు. అయితే పనులు పూర్తి చేయకుండా, మధ్యలోనే నిలిపేసిన కాంట్రాక్టర్, ఆయా పనుల్లో పాల్గొన్న కూలీలకు డబ్బులు చెల్లించకుండా జాప్యం చేస్తున్నారన్నారు. తక్షణమే సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలని, కూలీలకు రావాల్సిన డబ్బులు చెల్లించాలనిడిమాండ్ చేశారు. లేనిపక్షంలో గ్రామస్తులతో కలిసి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సంపంగిపుట్టులో సందడిగా గృహప్రవేశాలు

గృహప్రవేశాల కార్యక్రమంలో పాల్గొన్న పిఒ అభిషేక్

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని దుర్గం పంచాయతీ సంపంగిపుట్టు పివిటిజి గ్రామంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకంలో భాగంగా 2021-22 మంజూరై, నిర్మాణం పూర్తిచేసుకున్న 18 ఇళ్లలో గురువారం పాడేరు ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి వి.అభిషేక్ ఆధ్వర్యంలో లబ్ధిదారులంతా సంతోషంగా గృహప్రవేశాలు చేశారు. ముందుగా గ్రామానికి చేరుకున్న పిఒ అభిషేక్‌ను స్థానికులు గిరిజన సంప్రదాయం ప్రకారం పూలమాలలు వేసి, ఘనస్వాగతం పలికారు.

ఈ సందర్భంగా పిఒ అభిషేక్ మాట్లాడుతూ, ఆదిమజాతి గిరిజనులకు పిఎం జన్‌మన్ 2024-25 పథకంలో 28ఇళ్లు మంజూరుకాగా, ఇప్పటి వరకు ఆరు ఇళ్లకు శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. ఆయా ఇళ్లకు కేంద్ర ప్రభుత్వ గృహ నిర్మాణ పథకాలపై తీస్తున్న డాక్యుమెంటరీలో భాగంగా ఎన్ఐసి ఢిల్లీ తరపున కె సతీష్‌కుమార్, హైదరాబాదు సింటిల్ల క్రియేషన్స్ మేనేజింగ్ డైరెక్టర్ అల్లూరి జిల్లాకు వచ్చారు. ఈ సందర్భంగా ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి వి.అభిషేక్ మాట్లాడుతూ సొంతింటి కలను సాకారం చేసుకోవాలనే ఆశ అందరికీ ఉంటుందని, దాన్ని నెరవేర్చడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మంజూరై ఇంకా పనులు మొదలుపెట్టని లబ్ధిదారులు తక్షణమే పనులను ప్రారంభించాలని సూచించారు కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు

ఆరు మద్యం దుకాణాలకు 103 దరఖాస్తులు

ప్రజాశక్తి - చింతపల్లి : చింతపల్లి సబ్ డివిజన్ పరిధిలోని చింతపల్లి, జికె.వీధి, కొయ్యూరు మండలాలలోని ఆరు మద్యం దుకాణాలకు ఇప్పటివరకు103 దరఖాస్తులు వచ్చాయని స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ కూర్మారావు తెలిపారు. గురువారం స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంలో మాట్లాడుతూ చింతపల్లి మండలంలో మూడు షాపులకు 50, గూడెంకొత్తవీధి మండలంలో రెండు షాపులకు 10, కొయ్యూరు మండలంలో ఒక్క దుకాణానికి గాను 43 దరఖాస్తులు మొత్తంగా 103 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఈ నెల 11వ తేదీ శుక్రవారం సాయంత్రం ఐదు గంటల లోపు దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు.

ఉచిత గ్యాస్ అమలుపై స్పష్టతనివ్వండి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చిన్నయ్యపడాల్

ప్రజాశక్తి - చింతపల్లి : లబ్దిదారులకు ఏటా మూడు వంటగ్యాస్ సిలిండర్లను ఉచితంగా ఇస్తామన్న కూటమి ప్రభుత్వ హామీ అమలులో ఉన్న సందేహాలను నివృత్తి చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బోనంగి చిన్నయ్యపడాల్ అన్నారు. గురువారం స్థానిక గిరిజన సహకార సంస్థ కార్యాలయం వద్ద ఐకెవైసి నమోదుకు వేచి ఉన్న లబ్దిదారులతో మాట్లాడి, వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు అందరికి, కొందరికేనా అనే అనుమానాలు గ్యాస్ వినియోగదారులలో వ్యక్తమవుతున్నాయి. రెండు నెలల నుంచి ఐకెవైసి, బయోమెట్రిక్ అంటూ గ్యాస్ వినియోగదారులను ఇబ్బందులకు గురిచేస్తూ, జిసిసి కార్యాలయం చుట్టూ తిప్పుతూ ముప్పు తిప్పలు పెడుతున్నారన్నారు. ఎన్నికల ప్రచారంలో గ్యాస్ వినియోగదారులకు ఏడాదికి మూడు ఉచిత వంట గ్యాస్ సిలిండర్లు ఇస్తామని మర్యగ్గంగా వాగ్దానం చేసిందన్నారు, ప్రస్తుతం సోషల్ మీడియాలో ఉజ్వల, దీపం పథకం గ్యాస్ వినియోగదారులకు మాత్రమే ఈ పథకం వరిస్తుందని వార్తలు వైరల్ అవుతున్న నేపథ్యంలో వినియోగదారులు అయోమయంలో పడ్డారన్నారు. దీపావళి నుంచే ఈ హామీని అమలు చేస్తామని చంద్రబాబు, ఇతర నేతలు ప్రకటించిన నేపథ్యంలో ఐకెవైసి కోసం రెండునెలలుగా పడరాని పాట్లు పడుతున్నారన్నారు. చింతపల్లి జిసిసి కార్యాలయంలో జికే.వీధి, సీలేరు, చిట్రాలగొప్పు తదితర గ్రామాల గ్యాస్ వినియోగదారులు ఐకెవైసి కోసం ఇక్కట్లు పడుతున్నారన్నారు.

కాగా చింతపల్లి, జీకే వీధి, కొయ్యూరు మండలాలకు సంబంధించి, దీపం పథకం ద్వారా 6215 పెద్ద గ్యాస్‌సిలెండర్ కనెక్షన్లు, 6965 చిన్న గ్యాస్‌బండల కనెక్షన్లు ఉండగా, , ఉజ్వల పథకం ద్వారా 520, సాధారణ గ్యాస్ కనెక్షన్లు 3031 ఉన్నాయన్నారు. దీపం పథకం లబ్దిదారులకు మాత్రమే ఉచిత గ్యాస్ బండల పథకాన్ని వర్తింపజేస్తే, మిగిలిన గ్యాస్ వినియోగదారుల పరిస్థితి ఏంటని చిన్నయ్యపడాల్ ప్రశ్నించారు. ఎన్నికల ప్రచారంలో తెల్ల రేషన్ కార్డున్న గ్యాస్ వినియోగదారులందరికీ ఏటా మూడు బండలు ఉచితంగా ఇస్తామని చంద్రబాబు ప్రచారం నిర్వహించారని గుర్తు చేశారు. సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారంతో గ్యాస్ వినియోగదారుల్లో అయోమయం నెలకొని ఉందని, ఈ పథకం అమలుకు మరో 20రోజులుమాత్రమే లేని పరిస్థితుల్లో దీనిపై స్పష్టతనివ్వాలని చిన్నయ్యపడాల్ డిమాండ్ చేశారు. ఈ పథకాన్ని ఎలా అమలుచేస్తారో కూడా వెల్లడించాలని డిమాండ్ చేశారు.

ఐకెవైసి తీరును పరిశీలిస్తున్న సిపిఎం నేత చిన్నయ్య పడాల్

వైద్య కళాశాల పనులను వేగవంతం చేయండి

-జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

మెడికల్ కాలేజీ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి- పాడేరు : పాడేరులో మెడికల్ కళాశాల పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనుల్లో నాణ్యత లోపిస్తే సహించేది లేదని హెచ్చరించారు. గురువారం మెడికల్ కళాశాల పనులను పరిశీలించిన కలెక్టర్ నిర్మాణాల పట్ల సంతృప్తి వ్యక్త పరిచారు. మెడికల్ కళాశాల భవనంలో పూర్తి కానున్న తరగతి గదులు, అనాటమీ, బయో కెమిస్ట్రీ, హిస్టాలజి ల్యాబ్స్, ఆఫీస్ గదులు, మ్యూజియం, డైనింగ్, వసతి గహాలు తదితర నిర్మాణాలను పరిశీలించారు. త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేసి క్లాసుల నిర్వహణకు అప్పగించాలని ఆదేశించారు. నేషనల్ మెడికల్ కౌన్సిల్ ఈ ఏడాది నుండే ఎంబిబిఎస్ తరగతులకు అనుమతించిన నేపథ్యంలో కలెక్టర్ మెడికల్ కళాశాల నిర్మాణాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ వేగావంతానికి చర్యలు తీసుకుంటున్నారు. పరిశీలనలో కళాశాల ప్రిన్సిపాల్ డా. హేమలత, ఎపిఎస్ఎంఐడిసి కార్యనిర్వాహక ఇంజనీర్ అచ్చెం నాయుడు, డిఇఇ వర్మ, ఎఇఇ సురేష్, డిజిఎం మధుబాబు పాల్గొన్నారు.

నేడు 'మీ కోసం' రద్దు

ప్రజాశక్తి -పాడేరు: ఈనెల 11వ తేదీ శుక్రవారం జరగనున్న మీ కోసం కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం దుర్గాష్టమి సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ సెలవు దినం అయినందున మీ కోసం కార్యక్రమం రద్దు చేస్తున్నట్లు వివరించారు. ఫిర్యాదుదారులు గమనించి మీకోసం కార్యక్రమంలో ఫిర్యాదులు అందజేయడానికి రావద్దని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

వైద్య సేవలపై ఆరా తీస్తున్న ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

- ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం

ప్రజాశక్తి-రంపచోడవరం

ఏజెన్సీలోని ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చిన రోగులకు వెంటనే వైద్య పరీక్షలు నిర్వహించి మెరుగైన వైద్య సేవలు అందించాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం సంబంధిత అధికారులను ఆదేశించారు. రంపచోడవరం మండలం పెద గెద్దాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఎంతమంది వైద్యాధికారులు, వైద్య సిబ్బంది ఉన్నారు? ప్రతిరోజు ఎంతమంది రోగులకు వైద్య సేవలు అందిస్తున్నారు? రోజుకు ఎన్ని మలేరియా కేసులు వస్తున్నాయి? పిహెచ్‌సి పరిధిలో ఎంతమంది గర్భిణులు ఉన్నది ప్రాజెక్ట్ అధికారి ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చిన రోగులకు రక్త నమూనాలు స్వీకరించి ఆయా వ్యాధులకు ఉచిత మందులు సరఫరా చేయాలని సూచించారు. వివిధ వ్యాధులకు మందులు ఎప్పటికప్పుడు అందుబాటులో పెట్టాలని కోరారు. ఆస్పత్రిలో వైద్యాధికారులు, సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండాలని పిఒ ఆదేశించారు.

బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్‌రెడ్డిని సత్కరిస్తున్న ఎపి జెన్కో అధికారులు, సిబ్బంది

ఇఇగా శ్రీనివాస్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి -సీలేరు : ఏపీ జెన్కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (సివిల్)గా ఎం.శ్రీనివాస్‌రెడ్డి స్థానిక ఏపీ జెన్కో క్యాంపు కార్యాలయంలో గురువారం బాధ్యతలు చేపట్టారు. వీటీపీఎస్‌లో ఏపీ జెన్కో ఏడిఈగా పని చేస్తున్న శ్రీనివాస్‌రెడ్డికి జెన్కో ఉన్నతధికారులు ఇఇగా పదోన్నతి కల్పిస్తూ సీలేరు ఏపీ జెన్కో క్యాంప్ కార్యాలయానికి బదిలీ చేశారు. ఇప్పటివరకు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (సివిల్)గా పని చేసిన జి.భాస్కరరావును పంపు స్టోరేజ్ ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా బదిలీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డిని ఇఇ భాస్కర్‌రావు, ఏడిఈ వెంకట మధు, ఏఈలు సురేష్, అనుదీప్, సిబ్బంది సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ జెన్కో కార్మికులు పిల్ల రమణ, కాంట్రాక్ట్ కార్మిక సంఘం సిఐటియు బ్రాంచ్ అధ్యక్షుడు బి.లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఇద్దరు మావోయిస్టుల లొంగుబాటు

ప్రజాశక్తి-చింతూరు

అల్లూరి జిల్లా చింతూరు డివిజన్ కేంద్రంలోని ఎఎస్‌పి పంకజ్ కుమార్ మీనా ఎదుట ఇద్దరు మావోయిస్టులు గురువారం లొంగిపోయారు. ఈ మేరకు ఎఎస్‌పి మీనా ఆ వివరాలను వెల్లడించారు. చత్తీస్‌ఘడ్ రాష్ట్రం సుక్మా జిల్లా, బెజ్జి పోలీస్ స్టేషన్ పరిధి, దంతెస్పురం గ్రామానికి చెందిన ముచ్చిక ఐత మావోయిస్టు పార్టీ కిష్టారం ఏరియా కమిటీ 8 ప్లటూన్ సభ్యునిగా, కింద్రెల్పాడ్ గ్రామానికి చెందిన మడకం హింగే కుంట ఏరియా కమిటీ, కొంటా ఎల్ఓఎస్ పార్టీ సభ్యురాలుగా పని చేస్తున్నారు.

ముచ్చిక ఐత తన 16వ ఏటా మావోయిస్టు పార్టీకి ఆకర్షితులయ్యాడు. కిష్టారం ఏరియా కమిటీ కమాండర్ మడకం జోగా ఐత గ్రామానికి తరచూ వచ్చి సిఎన్ఎం బృందం సహాయంతో పాటలు, నృత్యం చేయడం ద్వారా ముచ్చిక ఐతను ఆకర్షించారు. దీంతో ఐత 2020 నుండి 2021 సంవత్సరం వరకు మావోయిస్ట్ పార్టీలో మిలీషియ సభ్యుడిగా పనిచేశాడు. 2021 మే నెలలో ముచ్చిక ఐతను కిష్టారం ఏరియా కమిటీ సభ్యుడిగా తీసుకున్నారు. 2022 జూన్ నెలలో 10 రోజుల శిక్షణ పొందిన తరువాత ముచ్చిక ఐతను 8వ ప్లాటూన్‌కు బదిలీ చేయడంతో నాటి నుండి ఆ బాధ్యతల్లో కొనసాగుతున్నారు. 2023 మేలో కుందర్ నుండి సిల్లర్కు వెళ్లాల్సిన ప్రత్యేక బలగాలపై చేసిన దాడిలో ముచ్చిక ఐత పాల్గొన్నారు.

కొంటా ఎల్ఓఎస్ మాజీ కమాండర్ వెట్టి భీమా ఏసీఎం బృందంతో కలిసి కింద్రెల్పాడ్ గ్రామాన్ని యూనిఫామ్‌లో ఆయుధాలతో సందర్శించేవారు. ఆ సమయంలో వెట్టి భీమా మడకం హింగే తండ్రి అయిన మడకం ముకాతో కుటుంబ సభ్యులలో ఒకరిని మావోయిస్ట్ పార్టీలో చేర్చాలని బెదిరించడంతో మడకం హింగేను మావోయిస్ట్ పార్టీలో చేర్చారు. 2017 డిసెంబర్‌లో మడకం హింగేను వెట్టి భీమా బందర్పదర్ అటవీ ప్రాంతానికి తీసుకొని వెళ్లి 5 రోజుల పాటు ప్రాథమిక సైనిక శిక్షణను ఇచ్చారు. శిక్షణ పూర్తి చేసిన తరువాత మడకం హింగేను పార్టీ సభ్యురాలిగా చేర్చి ఆమెకు 2 చేతి గ్రెనేడ్లు కేటాయించారు. 2021 సంవత్సరంలో బందర్పదర్ వద్ద ఆమె గ్రెనేడ్లు పిన్ తొలగించడంలో విఫలమైనందున ఆమెకు సింగిల్ షాట్ ఆయుధం, 5 రౌండ్లు కేటాయించారు. అప్పటి నుండి 2023 వరకు కొంటా ఎల్‌యుఎస్‌లో పని చేసింది. మడకం హింగే 2019 మేలో కన్నాయిపడ గ్రామంలో ప్రజాకోర్టును ఏర్పాటు చేసి ఇద్దరు విద్యార్థులను ఇన్‌ఫార్మర్ నెపంతో హత్య చేసిన ఘటనలోనూ, 2023 మార్చిలో మురళిగూడ గ్రామంలో వాహనాలను తగలబెట్టిన ఘటనలోనూ ప్రధానంగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎఎస్‌పి మాట్లాడుతూ మావోయిస్టు పార్టీ సిద్ధాంతాలకు ఆదరణ తగ్గడం, ఆదివాసీయేతర నాయకుల నుండి వివక్ష, పోలీసుల గస్తీ పెరగడం, ప్రాణ భయానికి గురికావడం, గిరిజన ప్రాంతంలో జరుగుతున్న అభివృద్ధి కార్యకలాపాలు, పోలీసులు నిర్వహిస్తున్న వివిధ సంక్షేమ చర్యలు, ప్రభుత్వం ప్రకటించిన పునరావాసం వంటి కారణాలతో మావోయిస్టులు లొంగిపోయినట్లు చెప్పారు. లొంగిపోయిన ముచ్చిక ఐత, మడకం హింగేలకు ఒక్కొకరికి లక్ష రూపాయల చొప్పున రివార్డ్, అర్హత ఉన్న ఇతర అన్ని సౌకర్యాలు అందించబడతాయని చెప్పారు.

లొంగిపోయిన మావోయిస్టులను మీడియా ముందు ఉంచి వివరాలు వెల్లడిస్తున్న ఎఎస్‌పి మీనా

అన్నపై తమ్ముడు గొడ్డలి, కర్రతో దాడి

ప్రజాశక్తి -సీలేరు : తన సొంత అన్నపై తమ్ముడు గొడ్డలి, కర్రలతో దాడి చేసిన సంఘటన జికె.వీధి మండలం, దుప్పిలివాడ పంచాయతీ శాండికోరి గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. సీలేరు ఎస్ఐ రామకృష్ణ తెలిపిన వివరాలు ప్రకారం... శాండికోరి గ్రామానికి చెందిన వంతల నందు తన భార్యను హత్య చేసిన ఘటనలో 14 సంవత్సరాలు జైలు శిక్ష అనుభవించి కొన్నాళ్ల క్రితం జైలు నుండి బయటకు వచ్చాడు. తరువాత చిన్న చిన్న పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలోనే నందు తన సొంత అన్న వంతల అజ్జు భార్యతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఈ విషయం తెలిసిన అజ్జు తమ్ముడు నందును నిలదీయగా, దీనిపై రెండు సార్లు తగాదాలు పడి కొట్టుకున్నారు. ఈ క్రమంలోనే అన్నదమ్ములు ఇరువురు మధ్య గురువారం గొడవ జరగడంతో తమ్ముడు నందు గొడ్డలి, కర్రలతో అన్న అజ్జుపై దాడి చేశాడు. దీంతో అజ్జు చేతికి బలమైన గాయాలయ్యాయి. దీంతో ఆయన్ను ఆసుపత్రిలో వైద్య సేవలు నిమిత్తం చేర్చారు. చేతులు విరిగినట్లు ప్రాథమికంగా తేలింది. ఈ సంఘటనపై వచ్చిన ఫిర్యాదు మేరకు నందుపై కేసు చేశామని, పరారీలో ఉన్న నిందితుడు నందు కోసం గాలిస్తున్నామని, కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రామకృష్ణ తెలిపారు.

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వంతల అజ్జు

పొగరాని పొయ్యిలు పంపిణీ చేస్తున్న క్రాప్ జోన్ ఆగ్రో ఫారెస్ట్ సభ్యులు

పొగరాని పొయ్యిలు పంపిణీ

ప్రజాశక్తి-రంపచోడవరం : మండలం ఫోక్స్‌పేట పంచాయతీ దిరిసినపల్లి గ్రామంలో క్రాప్ జోన్ ఆగ్రో ఫారెస్ట్ స్వచ్ఛంద సేవ సంస్థ ద్వారా పొగరాని పొయ్యిలు 100 కుటుంబాలకు గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టిడిపి మండల అధ్యక్షులు, ఉప సర్పంచ్ కారం సురేష్ బాబు మాట్లాడుతూ పొగరాని పొయ్యిలను ఉపయోగించడం వల్ల గుండెకి సంబంధించిన వ్యాధుల బారిన పడకుండా ఉండొచ్చని, పర్యావరణాన్ని రక్షించడానికి ఎంతగానో దోహదపడతాయని చెప్పారు. స్వచ్ఛంద సేవా సంస్థలు నిరుపేద గిరిజన కుటుంబాల ఆర్థికాభివృద్ధికి సహకరించి ఇటువంటి కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కోడె రవిబాబు, రాగాల సురేష్, పంచాయతీ పాలకవర్గ సభ్యులు మడి బుల్లమ్మ, కోసు నాగన్న దొర, సీనియర్ నాయకులు మడి కాంతమ్మ, తాటి రామయమ్మ, కోసు లక్ష్మి పాల్గొన్నారు.

నేడే మద్యం టెండర్ల దరఖాస్తుకు తుదిగడువు

ప్రజాశక్తి-రంపచోడవరం : మద్యం విధానం 2024-26కు సంబంధించి టెండర్లకు దరఖాస్తులను ఈ నెల 11వ తేదీ శుక్రవారం సాయంత్రం 7 గంటల వరకు స్వీకరించనున్నట్లు టాస్క్‌ఫోర్స్ అధికారి పి.నాగ రాహుల్, రంపచోడవరం ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎం.శ్రీధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ముందుగా రిజిస్ట్రేషన్ చేయబడి టోకెన్ తీసుకున్న చివరి వ్యక్తి వరకు దరఖాస్తుల స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకుని ఎంట్రీ పాస్ పొందిన దరఖాస్తుదారులు 14వ తేదీ ఉదయం 8 గంటలకు అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులోని విశాఖపట్నం వెళ్లే రోడ్డులో ఎస్‌పి కార్యాలయం వద్ద ఉన్న విఆర్ ఫంక్షన్ హాల్ వద్ద హాజరుకావాలని కోరారు. ఇప్పటివరకు రంపచోడవరం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 10 షాపులకు 168 దరఖాస్తులు, చింతూరు ఎక్సైజ్ పరిధిలో 8 షాపులకు 320 దరఖాస్తులు వచ్చినట్లు పేర్కొన్నారు. పర్యాటకం అభివృద్ధి దిశగా కొనసాగుతున్నందున ఎక్కువ మంది దరఖాస్తు చేయడానికి ఆసక్తి చూపుతున్నారని తెలిపారు. లాటరీ దుకాణములు పొందిన వారు అదే రోజు 1/6 రిటైల్ ఎక్సైజ్ ఫ్యాషన్ చలనా రూపంలో ఇక్కడే లాటరీ జరుగు ప్రదేశంలో నిర్ణీత సమయానికి చేరుకోవాల్సిన బాధ్యత దరఖాస్తుదారులపై ఉంటుందని స్పష్టం చేశారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-చింతూరు : ఎటపాక మండలం, గొల్లగుప్ప గ్రామానికి చెందిన గిరిజనుడు మడివి వీరయ్య ప్రమాదంలో మృతి చెందటంతో అతని అంత్యక్రియల నిమిత్తం బాధితుని కుటుంబ సభ్యులకు జెకెసి ట్రస్టు చైర్మన్ మొహమ్మద్ జమాల్ ఖాన్ గురువారం రూ.5వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ముత్యాల శ్రీరామ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందిస్తున్న జెకెసి ట్రస్టు చైర్మన్ జమాల్ ఖాన్

సోలార్ లిఫ్ట్ ఇరిగేషన్‌తో ప్రయోజనం

- జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్

డుంబ్రిగుడలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి పాడేరు/ డుంబ్రిగుడ/ హుకుంపేట : సోలార్ లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా వ్యవసాయ భూములకు నీరందించి రైతులు అదనపు ఆదాయాన్ని పొందాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ సూచ్గించారు. గురువారం హుకుంపేట మండలం, పెదగరువు గ్రామం, డుంబ్రిగుడ మండలం, బలియగూడ గ్రామాలలో కలెక్టర్ పర్యటించారు. పెదగరువు గ్రామంలో వాసన్ సంస్థ ఏర్పాటు చేసిన సోలార్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రోజెక్టు , మోటరైజడ్ బేబీ పల్వర్లు, జీవామృతం తయారీ యూనిట్, ఏ 3 వనం, నాటుకోళ్ల ఉత్పత్తి కేంద్రం, పలు పంటల నమూనాలను సందర్శించారు. సోలార్‌తో పనిచేసే పల్వింగ్ యంత్రాలు డిజైన్ చేయాలని కలెక్టర్ సూచించారు. గిరిజన ప్రాంత రైతులకు వివిధ పనిముట్లు యంత్రాలు అందించి వారికి జీవనోపాధి కల్పించాలని సూచించారు. వాసన్ సంస్థ అందిస్తున్న జలమిత్ర శిక్షణ, యంత్రాల మరమ్మతుల శిక్షణ బాగుందని, శిక్షణ పొందిన యువత ద్వారా ఐటిడిఎ ఇచ్చిన 121 మినీ సోలార్ పల్వింగ్ యంత్రాలను మరమ్మతు చేయించాలని సూచించారు. రైతులకు యంత్రాలను రిపేమేంట్ చేసే విధానంలో వెలుగు ద్వారా అందించాలన్నారు. ఇక్కడ పంటలన్నీ ప్రకృతి వ్యవసాయ విధానంలో చేస్తున్నందున, ఈ ఉత్పత్తులను విశాఖపట్నంలోని పెద్ద మాల్స్‌తో టై అప్ చేసి మార్కెటింగ్ సామర్థ్యాన్ని పెంచాలని ఆదేశించారు. అక్కడ డిమాండ్ ఉన్న కూరగాయలు పండించేందుకు రైతులు ముందుకు రావాలన్నారు. నీటి వనరులున్న ప్రాంతాలన్నీ సద్వినియోగం చేసుకుని ఎక్కువ భూమిలో పంటలు పండించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

అనంతరం డుంబ్రిగుడ మండలంలో పర్యటించిన కలెక్టర్ అక్కడ తహసిల్దార్, ఎంపిడిఓ కార్యాలయాలను సందర్శించి హాజరు, ఇతర రికార్డులను పరిశీలించారు. బలియగూడ గ్రామాన్ని సందర్శించి స్టెప్ కల్టివేషన్, కాఫీ, కూరగాయల నమూనాలను పరిశీలించారు. రైతులతో సమావేశమై ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేస్తున్న కాఫీ, మిరియాల పంటలలో వారు ఎదుర్కుంటున్న సమస్యలు, సవాళ్ళపై ఆరా తీసారు. వాసన్ సంస్థ ఎనిమిదేళ్లుగా స్థానిక స్వచ్ఛంద సంస్థలు, ఆర్‌వైఎస్ఎస్ సంస్థలతో కలసి ఐటిడిఎ ప్రాంతంలో వర్షాధార వ్యవసాయం, పశు సంపద, జీవనోపాదులపై పని చేస్తోందని ఆ సంస్థ డిపిఒ నాయుడు కలెక్టర్‌కు తెలిపారు. పర్యటనలో ఆర్‌వైఎస్ఎస్ సంస్థ డిపిఎం భాస్కర్, వాసన్ సంస్థ డిపిఎంలు నాయుడు, నరసింహ రావు, జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఎస్బిఎస్ నంద్, ఎస్ఎంఐ డిఇఇ శ్రీనివాస్ పాల్గొన్నారు.

థింసా కళాకారులకు గుర్తింపు కార్డులు

డుంబ్రిగుడ: ఆదివాసీ సాంప్రదాయ థింసా నృత్య కళాకారులకు గుర్తింపు కార్డులు ఇస్తామని జిల్లా కలెక్టర్ ఎఎస్.దినేష్‌కుమార్ అన్నారు. గురువారం ఏజెన్సీలో ప్రముఖ పర్యాటక కేంద్రమైన చాపరాయి జలపాతాన్ని జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ సందర్శించారు. చాపరాయి నిర్వహణ తీరుపై అక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పర్యాటకులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు. చాపరాయిలో పార్కింగ్ వసూళ్లకు ప్రత్యేక వేలంపాట నిర్వహించి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని కలెక్టర్‌ను అడగగా, ఆయన స్పందిస్తూ, పార్కింగ్ కోసం ప్రత్యేక స్థలాన్ని కేటాయిస్తున్నామని, హైవేరోడ్డు నిర్మాణం పూర్తయిన తర్వాత పార్కింగ్‌కు వేలంపాట టెండర్లు నిర్వహిస్తామన్నారు. చాపరాయి జలపాతం సందర్శనకు వచ్చే పర్యాటకులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా నిర్వహణ సిబ్బంది చూసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. గిరిజన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే థింసా నృత్యాన్ని ప్రదర్శించే కళాకారులకు గుర్తింపుకార్డులు ఇచ్చి ప్రోత్సాహిస్తామన్నారు.

మాట్లాడుతున్న డిపిహెచ్ఎన్ఒ భూలోకమ్మ

మాతా, శిశు మరణాలపై అప్రమత్తత

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మాతాశిశు మరణాలపై అప్రమత్తంగా డిపిహెచ్ఎన్ఒ భూలోకమ్మ అన్నారు. గురువారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశ కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో మతాశిశు మరణాలు జరగకుండా చూడాలన్నారు. తల్లీబిడ్డల ఆరోగ్య పరిరక్షణతోపాటు, ఆహార పరిశుభ్రతను పెంపొందించాలన్నారు. అప్పుడే పుట్టిన శిశువుకు తల్లిపాలు అందించడంపై అవగాహన కల్పించాలని సూచించారు. ఆశ కార్యకర్తలు విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉంటూ ఆరోగ్య రక్షకులుగా ఎదగాలని ఆకాంక్షించారు.. వైద్యాధికారిణి డాక్టర్ అంబిక, ఎంపిహెచ్ఐఒ శౌరి, ఎంపిహెచ్ఎస్‌లు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్‌సిసి ఆర్మీ వింగ్ లెఫ్టినెంట్‌గా హరికిరణ్

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : పట్టణానికి చెందిన వి హరికిరణ్ కు అరుదైన గౌరవం లభించింది. మాకవరపాలెం అవంతి కాలేజీలో మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతిగా, ఎన్‌సిసి కేరటేకర్ ఆఫీసర్‌గా పని చేస్తున్న డాక్టర్ వి హరికిరణ్‌కు ఎన్‌సిసి ఆర్మీ వింగ్ నుండి లెఫ్టినెంట్‌గా ఎన్‌సిసి మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్ ప్రమోషన్ కల్పించింది. నాగపూర్‌లోని మహారాష్ట్ర ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీలో ప్రి కమిషన్ 75 రోజుల మిలటరీ ట్రైనింగ్ కోర్సులో ఉత్తీర్ణత అనంతరం లెఫ్టినెంట్‌గా ర్యాంక్ లభించిందని హరికిరణ్ తెలిపారు. వ్యవసాయ కుటుంబానికి చెందిన హరికిరణ్ అంచెలంచెలుగా ఎదుగుతూ ఎన్‌సిసి ఆర్మీ వింగ్ లెఫ్టినెంట్ స్థాయికి చేరుకోవడంతో కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తుండగా, పలువురు అభినందనలు తెలిపారు.

మిరియాలు ఒలిచే యంత్రాలకు..

20 వరకు దరఖాస్తు గడువు పొడిగింపు

ప్రజాశక్తి - పాడేరు: కేంద్ర ప్రభుత్వం స్పైసెస్ బోర్డు సహకారంతో గిరిజన రైతులకు రాయితీపై మిరియాలు ఒలిచే యంత్రాలు, శుభ్రపరిచే యంత్రాలు పంపిణీ చేయడానికి దరఖాస్తులు స్వీకరణ గడువను ఈనెల 20 వరకు పొడిగించామని జిల్లా కలెక్టర్ ఎఎస్. దినేష్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మిరియాలు ఒలవడానికి, ఎండబెట్టిన తరువాత శుభ్రం చేయడానికి ఉపయోగ పడే యంత్రాలను గిరిజన రైతులకు 75 శాతం రాయితీపై అందిస్తామన్నారు. యంత్రాలు, విద్యుత్తు, డీజిల్, పెట్రోల్ సహాయంతో పనిచేస్తాయన్నారు. అల్లం, పసుపు పాలిష్ చేసే యంత్రాలను 75 శాతం రాయితీపై మంజూరు చేస్తామన్నారు. రైతులు ముందుగా యంత్రాలకు పూర్తిగా చెల్లింపు చేయాలని, . అనంతరం రైతు ఖాతాకు 75శాతం రాయితీ జమ చేస్తామన్నారు. మిరియాలు, అల్లం, పసుపు సాగు చేస్తున్న గిరిజన రైతులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు 90 శాతం రాయితీపై అందిస్తామన్నారు. ఐటిడిఏ కార్యాలయంలో స్పైసెస్ బోర్డు కార్యాలయంలో ఉన్న ఉద్యాన వన విభాగంలో లేదా సెరీకల్చర్ విభాగంలో 20 వ తేదీలోగా దరఖాస్తులను అందజేయాలని కోరారు. దరఖాస్తులకు ఆధార్ కార్డు, కులదవీ కరణ పత్రం, బ్యాంకు పాసు పుస్తకం మొదటి పేజీ, పోడు పట్టా లేదా భూమి పట్టా జెరాక్స్ కాపీలను, మొబైల్ ఫోన్ నంబరు, పాస్ పోర్టు సైజులను దరఖాస్తులకు జత చేయాలని సూచించారు.

బదిలీ కార్యదర్శులకు ఘన సత్కారం

ప్రజాశక్తి - చింతపల్లి

ఎర్ర బొమ్మల పంచాయతీ అభివృద్ధికి పంచాయతీ, సచివాలయ కార్యదర్శులు చేసిన కృషి ఎనలేనిదని సర్పంచ్ లోతా పండయ్య అన్నారు. గురువారం బదిలీపై వెళ్తున్న పంచాయతీ, సచివాలయ కార్యదర్శులు ఎస్ రాజేష్, డి వెంకటరమణలను సర్పంచ్ పండయ్య ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.కార్యక్రమంలో ఆ పంచాయతీ ఎంపిటిసి సభ్యుడు సేగ్గే సత్తిబాబు, మాజీ ఎంపిటిసి సభ్యుడు బేరా సత్యనారాయణ, బేర హరిబాబు. ఎం రాజుబాబు. కె. బాలరాజు, జర్త చిన్నబ్బాయి, ఎం. లోవరాజు వెంకటేశ్వర్లు, బుజ్జి రాజు, భవాని బాబు పాల్గొన్నారు.

సత్కరిస్తున్న సర్పంచ్ పండయ్య

శ్రమదానంతో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి -నక్కపల్లి: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం నక్కపల్లిలో అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు శ్రమదానంతో పారిశుధ్య పనులు చేపట్టారు. మండల పరిషత్ కార్యాలయం, ఆసుపత్రి, జాతీయ రహదారి పక్కన పరిసర ప్రాంతాలు, హోటల్స్, కిరాణా షాపులు, మార్కెట్ పరిసర ప్రాంతాల్లో ఉన్న చెత్తను తొలగించారు. హోటల్స్, కిరాణా షాపు యాజమాన్యాలతో మాట్లాడి డస్ట్ బిన్‌లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఎక్కడపడితే అక్కడ చెత్తను వేయరాదని, పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ జయ రత్నకుమారి, మండల ప్రత్యేక అధికారి జి ప్రభాకరరావు, ఎంపిడిఒ సీతారామరాజు, తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్, పంచాయతీ ఉపసర్పంచ్ వీసం రాజు, ఇఒపిఆర్‌డి సత్యనారాయణ, ఎపిఒ భాగ్యలత, వెలుగు ఎపిఎం, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

కోటవురట్ల : గ్రామీణ ప్రాంత ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల ప్రత్యేక అధికారిని ఉదయశ్రీ అన్నారు, గురువారం మండలంలో పలు గ్రామాలలో సందర్శించి స్వచ్ఛంద పారిశుధ్య పనుల్లో పాల్గొన్నారు, ఈ సందర్భంగా మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది సేవలను సద్వినియోగించు కోవాలన్నారు, అనంతరం మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపిడిఒ కాశీ విశ్వనాథరావు, ఎఒ చంద్రశేఖర్, పలువురు కార్యదర్శులు సిబ్బందితో కలిపి తుప్పలను తొలగించే కార్యక్రమంలో పాల్గొన్నారు.

జిందాల్ పవర్ ప్లాంట్‌కు చెత్త తరలింపు

ప్రజాశక్తి నర్సీపట్నం టౌన్ : మున్సిపాలిటీలోని డంపింగ్ యార్డులో పేరుకుపోయిన చెత్తను అత్యవసరంగా విశాఖపట్నం కాపులుప్పాడ డంపింగ్ యార్డ్‌లోని జిందాల్ పవర్ ప్లాంట్‌కు తరలిస్తున్నట్లు మునిసిపల్ కమిషనర్ జె. సురేంద్ర తెలిపారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ పట్టణంలో సేకరించిన చెత్తంతా డంపింగ్ యార్డ్‌లో పేరుకుపోయిందన్నారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆదేశాలు మేరకు ఈ చెత్తను జిందాల్ పవర్ ప్లాంట్ కు తరలిస్తున్నామని సురేంద్ర తెలిపారు. స్పీకర్ అయ్యన్న ఆదేశాలతో 35 టిప్పర్ల ద్వారా చెత్తను తరలిస్తున్నామన్నారు. డంపింగ్ యార్డ్ వద్ద టిప్పర్ల ద్వారా చెత్త తరలింపును ఎఇ రవి, వార్డ్ కౌన్సిలర్ రామరాజు, ధనమిరెడ్డి మధు, పైలా గోవింద్, శ్రీకాంత్, మున్సిపల్ సిబ్బంది పర్యవేక్షిస్తున్నారని తెలిపారు.

నిత్యావసరాల ధరలు తగ్గించాలని నిరసన

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : పెరుగుతున్న నిత్యవసర వస్తు ధరలు తగ్గించాలని స్థానిక రామారావు పేట సిపిఎం కార్యాలయం వద్ద ఆ పార్టీ నేతలు గురువారం నిరసన చేపట్టారు. ఈసందర్భంగా . సిపిఎం నాయకులు ఈరెల్లి చిరంజీవి మాట్లాడుతూ, అడ్డూఅదుపూ లేకుండా పెరుగుతున్న నిత్యవసర సరుకులు, కూరగాయల ధరలతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు జీవనం దుర్భరమౌతోందని ఆవేదన వ్యక్తం చేశారు. టమోటా, ఉల్లిపాయలు, పప్పులు, నూనెలు ఇతరత్రా దాదాపు అన్ని వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయన్నారు. ధరల నియంత్రణకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అలాగే డీజిల్, పెట్రోల్‌ను జిఎస్‌టి పరిధిలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఎంఆర్‌పి కన్నా అధిక ధరలకు వస్తువులను అమ్ముతున్న దుకాణాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. పెరుగుతున్న నిత్యవసరాల ధరల నియంత్రణకు తక్షణ చర్యలు చేపట్టకుంటే ఆందోళన చేపడతామని హెచ్చరించారు.. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా అధ్యక్షురాలు ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఐసి ఏజెంట్ల ఆందోళన

ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్ : తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ ఎల్ఐసి ఏజెంట్లు నర్సీపట్నంలో గురువారం ఆందోళన చేపట్టారు. ఎల్ఐసి బ్రాంచ్ మేనేజర్, అధికారులకు వినతిపత్రం అందచేశారు. ఈంసదర్భంగా ఎల్ఐసి నర్సీపట్నం శాఖ యూనియన్ సెక్రటరీ కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఈ నెల ఒకటవ తేదీ నుంచి యాజమాన్యం తీసుకువచ్చిన నూతన పాలసీ అటు పాలసీదారులకు, ఇటు ఏజెంట్లకు విఘాతం కలిగించే విధంగా ఉందన్నారు. దీని వల్ల ఒక్క నర్సీపట్నం బ్రాంచ్‌లోనే సుమారు 2 వేల మంది ఏజెంట్లు, దేశవ్యాప్తంగా 15 లక్షల మంది ఏజెంట్లు రోడ్డున పడే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై పునరాలోచన చేసి పాత విధానంలోనే ఏజెంట్లకు వచ్చే కమీషన్లను అమలు చేయాలని తెలిపారు. పాలసీని సరెండర్ చేస్తే కమిషన్ పొందిన ఏజెంట్ నుంచి నష్టాన్ని రికవరీ చేయాలన్న నిబంధనను పూర్తిగా తొలగించాలని డిమాండ్ చేశారు. కొత్త విధానంలో ఎష్యూర్డ్ విలువను రూ.లక్ష నుంచి రూ.రెండు లక్షలకు పెంచారని, దీంతో సామాన్యులు బీమా చేయించుకునేందుకు ఆర్థిక ఇబ్బందులు ఏర్పడతాయన్నారు.

విజేతలతో అతిథులు

ముగిసిన డాక్టర్స్ టేబుల్ టెన్నిస్ టోర్నీ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : హెచ్‌సిజి కేన్సర్ హాస్పిటల్, ప్లే ఫిట్ టేబుల్ టెన్నిస్ అకాడమీ ఆధ్వర్యంలో తలపెట్టిన ఎపి డాక్టర్స్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్ సీజన్ - 3 పోటీలు ఎంవిపి.కాలనీలోని ఎస్-3 ఇండోర్ స్టేడియంలో ముగిశాయి. విశాఖపట్నం టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ కార్యదర్శి డివిఎస్‌వై.శర్మ, ఆంధ్రప్రదేశ్ టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు పివిఎన్.సూర్యారావు ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

విజేతలు వీరే..

మహిళల అండర్ - 35 ఉమెన్స్ సింగిల్స్ విభాగంలో డాక్టర్ సరాజిత, 36-45 విభాగంలో డాక్టర్ శైలజ, 46 సంవత్సరాల విభాగంలో డాక్టర్ అరుణ, ఉమెన్స్ డబుల్స్ విభాగంలో డాక్టర్ జీబ అర్షియా, డాక్టర్ సహస్ర విజేతలుగా నిలిచారు. పురుషుల అండర్ - 35 సింగిల్స్ విభాగంలో డాక్టర్ అశోక్ కుమార్, 45 సంవత్సరాల విభాగంలో డాక్టర్ రామానుజం, డబుల్స్ విభాగంలో డాక్టర్ ఎ.సార్వభౌమ, డాక్టర్ ఫణి శేఖర్, మిక్సిడ్ డబుల్స్ విభాగంలో డాక్టర్ ఫణి, డాక్టర్ జీబ అర్షియాలు విజేతలుగా నిలిచారు.

శామ్‌సంగ్ కార్మికుల అరెస్టులు హేయం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : తమిళనాడులోని శ్రీపెరంబదూర్ శామ్‌సంగ్ యూనిట్‌లో 1470 మంది కార్మికులు చేస్తున్న పోరాటాన్ని ఉక్కుపాదంతో అణచివేయడాన్ని సిఐటియు విశాఖ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కెఎం.శ్రీనివాసరావు, ఆర్‌కెఎస్‌వి.కుమార్ గురువారం ఓ ప్రకటనలో ఖండించారు. కార్మికుల అక్రమ అరెస్టులు హేయమని పేర్కొన్నారు. నెలరోజులుగా శామ్‌సంగ్ ఉద్యోగులు తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని పోరాడుతున్నారన్నారు. యాజమాన్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుమ్మక్కై పోలీసులను పెట్టి అక్రమంగా ఉద్యోగులు, కార్మికుల ఇళ్లకు అర్ధరాత్రి సమయంలో వెళ్లి అరెస్టులు చేయడం, వారు వేసిన టెంట్‌లను తొలగించడం దుర్మార్గమని పేర్కొన్నారు. ఈ చర్యలు తక్షణమే ఆపాలని కోరారు. 1800 మందికిగానూ 1470 మంది కార్మికులు యూనియన్‌ను పెట్టుకుంటే దానిని యాజమాన్యం తిరస్కరించడం తగదన్నారు. యూనియన్ పెట్టుకొనే హక్కు రాజ్యాంగబద్ధమైనదని, కార్మిక చట్టాలను అమలు చేయాల్సిన బాధ్యత యాజమాన్యానిది, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలదని గుర్తుచేశారు. ఆ పనిచేయకుండా కార్మికులపై ఉక్కుపాదం మోపడం సమంజసం కాదన్నారు. తక్షణమే ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చేందుకు యూనియన్‌తో చర్చలు జరపాలని కోరారు. లేనిపక్షంలో శామ్‌సంగ్ ఉద్యోగుల పోరాటానికి దేశవ్యాప్తంగా కార్మికులను కూడగట్టి ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

గో సంరక్షణ పేరుతో బిజెపి, ఆర్ఎస్ఎస్ దాడులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఉత్తర భారత దేశంలో గో సంరక్షణ పేరుతో మైనారిటీలు, దళితులు, గిరిజనులపై బిజెపి, ఆర్ఎస్ఎస్ శ్రేణులు దాడులతో రోజురోజుకూ పేట్రేగిపోతున్నాయని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణమూర్తి తెలిపారు. గురువారం పార్టీ విశాఖ జిల్లా కార్యాలయంలో కార్యవర్గ సభ్యులు జిఎస్‌జె.అచ్యుతరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హర్యానాలో ఇంటర్ పాసైన విద్యార్థిపై పైశాచికంగా డాడి చేస్తే ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి కనీసం ఖండించకపోవడం శోచనీయమని అన్నారు. కొల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచారం, గుజరాత్‌లో బాలిక హత్య జరిగినా నోరు మెదపకపోవడం విచారకరమన్నారు. ఒడిశా, మధ్యప్రదేశ్, మణిపూర్ వంటిచోట్ల భయానక పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. దేశంలో షేర్ మార్కెట్‌లో వంద మంది పెట్టుబడులు పెడితే కేవలం ముగ్గురికి మాత్రమే లాభాలు వస్తున్నాయని తెలిపారు.

ఇంకానా.. 'ఉక్కు'పై ప్రతిష్టంభన..!

ప్రైవేటీకరణపై కూటమి సర్కారుకు రావాల్సిన స్పష్టత ఏమిటి ?

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో



ప్రతిష్టాత్మక విశాఖ ఉక్కుపై నేటికీ ప్రతిష్టంభన కొనసాగుతోంది. వాస్తవానికి విశాఖ ఉక్కులో ప్రైవేటీకరణ ప్రక్రియకు సంబంధించిన పనులను తెర వెనుక కేంద్రం చేసుకుంటూ పోతున్న సంగతి తెలిసిందే. ప్లాంట్ మనుగడకు కీలకమైన ఉత్పత్తిని ఇప్పటికే పూర్తిగా దెబ్బతీసేసింది. మూడు బ్లాస్ట్ ఫర్నేస్‌లకుగానూ ఒక్కదానిపైనే ప్రస్తుతం ప్లాంట్ నడుస్తోంది. కాంట్రాక్టు కార్మికులు సుమారు 433 మందిని వివిధ విభాగాల నుంచి ఏరివేసింది. మరోవైపు పర్మినెంట్ కార్మికుల మెడపై షిఫ్టింగ్ కత్తి వేలాడిస్తోంది. ప్రైవేటీకరణ చేసి తీరుతామని మూడేళ్ల క్రితం ప్రకటించిన దేశ ప్రధాని నరేంద్ర మోడీ నోట నుంచి ఉక్కు రక్షణ మాట మాత్రం రావడం లేదు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఢిల్లీ వెళ్లి రాష్ట్రానికి తిరిగొచ్చినా ప్లాంట్‌పై ఇంకా సమస్యలు ఉన్నాయంటూ సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. మొత్తానికి చంద్రబాబు, విశాఖ ఎంపీ శ్రీభరత్, గాజువాక ఎమ్మెల్యే, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు తదితరులు 'ఇంకా చర్చిస్తున్నాం... సమావేశాలు, సమీక్షలు నిర్వహిస్తున్నాం' అన్న మాటలనే వినిపిస్తున్నారు.

మోడీ డిసెంబరులో విశాఖకు రాక

విశాఖలో రైల్వే జోన్ కార్యాలయ శంకుస్థాపనకు ప్రధాని మోడీ డిసెంబర్‌లో వస్తారని, అప్పుడు ఉక్కుపై పూర్తిగా స్పష్టత వస్తుందన్న చర్చ కూడా కూటమి పార్టీల్లో నడుస్తోంది. స్టీల్ ప్లాంట్‌లో కూడా ఇదే విషయాన్ని కార్మికులు చర్చించుకుంటున్నారు. అదీగాక ఇంకా త్రీమెన్ కమిటీని కూడా కేంద్రం నియమిస్తుందంట ?. ఇప్పటికే నలుగురు సిఎమ్‌డిలు ప్లాంట్‌కు మారారు. ఒక సిఎమ్‌డి సెలవులో ఉండగా, అతని స్థానంలో వచ్చిన ఇన్‌ఛార్జి సిఎమ్‌డిని కేంద్రం మార్చేసింది. ఇప్పుడు సక్సేనా ఇన్‌ఛార్జి సిఎమ్‌డిగా వ్యవహరిస్తున్నారు. ఫ్యాక్టరీని పూర్తి సామర్థ్యంతో నడిపే చర్యలకూ, మోడీ విశాఖ రాకకు, కమిటీలు వేసి చర్చించేందుకు ఏమైనా సంబంధం ఉందా ? అని కార్మికులు తాజాగా ప్రశ్నిస్తున్నారు. కేంద్రంగానీ, రాష్ట్రంలోని కూటమి సర్కారుగానీ ఫ్యాక్టరీని నడపాలనుకున్నప్పుడు.. ముఖ్యంగా ప్రైవేటీకరణ కాకుండా చూస్తామని చెబుతున్నప్పుడు మూడు బ్లాస్ట్ ఫర్నేస్‌లను రన్నింగ్‌లోకి వచ్చేలా ఎందుకు ఢిల్లీ పెద్దలను ఒప్పించలేకపోతున్నారు ? అన్నది ఇప్పుడు అందరిలోనూ ఉద్భవిస్తున్న ప్రశ్న.

ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని, సొంత గనులు, వర్కింగ్ కేపిటల్ కేటాయించాలని, పూర్తిస్థాయి సామర్థ్యంతో కర్మాగారాన్ని నడిపించాలని, పర్మినెంట్, కాంట్రాక్టు కార్మికుల తొలగింపు చర్యలను విడనాడాలని అందరూ డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో డిసెంబరు వరకూ బాలారిష్టాలతో ప్లాంట్ నడుస్తుందా ? ఈలోగా ఊపిరి పోసే చర్యల దిశగా కూటమి సర్కారు చర్యలు తీసుకుంటుందా ? అన్నది వారి విధానంపై ఆధారపడి ఉంది.

ప్రధాన సమస్యలపై నిర్దిష్ట చర్యలు తీసుకోండి

ఎంపీ శ్రీభరత్‌కు సిపిఎం వినతి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్, ఎంవిపి.కాలనీ : జిల్లాలోని ప్రధాన సమస్యలపై నిర్దిష్ట చర్యలు తీసుకోవాలని విశాఖ పార్లమెంట్ సభ్యులు ఎం.శ్రీ భరత్‌ను సిపిఎం బృందం కోరింది. పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, కార్యదర్శివర్గ సభ్యులు డాక్టర్ బి.గంగారావు, బి.జగన్, జిల్లా కమిటీ సభ్యులు పివిఎస్‌బి.శ్రీనివాసరాజులతో కూడిన బృందం గురువారం ఈ మేరకు ఎంపీ శ్రీభరత్‌కు వినతిపత్రాలు అందజేసింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని, సొంత గనులు, వర్కింగ్ కేపిటల్ ఇవ్వాలని, పూర్తిస్థాయి సామర్థ్యంతో నడిపించాలని, నిర్వాసితులకు ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. పర్మినెంట్, కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపును పూర్తిగా నిలిపివేయాలని, కాలపరిమితి పూర్తి పేరుతో నిలిపివేసిన వివిధ విభాగాల కాంట్రాక్టు కార్మికులు 433 మందిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

నేవల్ డాక్ యార్డ్ వద్దగల ఎస్‌బిసి సర్దార్ వల్లభాయ్ పటేల్ 'పేర్లర్ బ్రిడ్జి' పున:నిర్మాణ పనులు పూర్తయ్యే వరకు ఎస్‌బిసి బ్రిడ్జి మీదుగా భారీ వాహనాలు మినహా ప్రయాణికుల వాహనాల రాకపోకలు అనుమతించాలని కోరారు. లక్షలాది మంది ఉద్యోగుల, కార్మికుల, ప్రజల ప్రాణాలకు భద్రత కల్పించే చర్యలు చేపట్టాలన్నారు.

పోర్టు ఆసుపత్రి గురించి ఎంపీకి వివరిస్తూ.. విశాఖ పోర్టు గోల్డెన్ జూబ్లీ ఆసుపత్రి ప్రైవేటీకరణను నిలిపివేయాలని, పిపిపి పేరుతో టెండర్లు రద్దు చేయాలని, 40 వేల మంది లబ్ధిదారుల ఆరోగ్యాలకు రక్షణ కల్పించాలని కోరారు. పోర్టు లాభాలతో నడుస్తున్న క్రమంలో పోర్టు నిధులతోనే ప్రస్తుత ఆసుపత్రిని మల్టీసూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిగా నిర్మించే చర్యలు చేపట్టాలన్నారు.

రైల్వే కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

రైల్వే కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను సిపిఎం నాయకులు ఎంపీకి వివరించారు. కనీస వేతనాలు, కార్మిక చట్టాలు రైల్వే కాంట్రాక్టు కార్మికులకు అమలు కావడం లేదని, నెలల తరబడి జీతాలు చెల్లించటం లేదని ఫిర్యాదు చేశారు. అక్రమ తొలగింపులకు పూనుకుంటున్నారని, లేబర్ అధికారుల ఆదేశాలను పాటించటం లేదని తెలిపారు. కార్మిక చట్టాలను కట్టుదిట్టంగా అమలు చేయాలని కోరారు. సిపిఎం నేతలు ఇచ్చిన వినతి పత్రాల్లోని అంశాలపై ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను లాభాల బాట పట్టించేందుకు కేంద్రం అంగీకరించిందని, ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రధాని, కేంద్ర మంత్రులతో చర్చలు జరిపారని చెప్పారు. ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలో లాభాల్లోకి తేవాలన్న పట్టుదలతో చంద్రబాబు ఉన్నారన్నారు. అక్టోబరు నెలాఖరుకు ప్రత్యేక ప్యాకేజీ వస్తుందని, కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపు ఉండదని, నిలిపివేసిన కాంట్రాక్ట్ కార్మికులను విధులోకి తీసుకునేలా చేస్తామని తెలిపారు. ఎస్‌బిసి బ్రిడ్జి పై నుంచి రాకపోకలకు సంబంధించి రక్షణ మంత్రిత్వ శాఖతోనూ, రక్షణ రంగం అధికారులతోనూ మాట్లాడుతానని ఎంపీ చెప్పారు. పోర్టు ఆసుపత్రి ప్రైవేటీకరణపైన సంబంధిత మంత్రిత్వ శాఖ అధికారులతో మాట్లాడతానన్నారు. రైల్వే కాంట్రాక్ట్ కార్మికులకు చట్టాల అమలు విషయమై రైల్వే డిఆర్‌ఎంతో చర్చిస్తానన్నారు.

బాల్యం కేంద్రాల్లో వినూత్న బోధన చేపట్టాలి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ నగరంలోగల బాల్యం విద్యా కేంద్రాల్లో విద్యార్థులను ప్రాథమిక విద్యకు సంసిద్ధం చేసేలా వినూత్నమైన పద్ధతిలో సృజనాత్మకంగా అధ్యాపకులు బోధన చేపట్టాలని జివిఎంసి అదనపు కమిషనర్ ఎస్-ఎస్.వర్మ అన్నారు. గురువారం ఆయన రేసపువానిపాలెంలోని జివిఎంసి బాల్యం విద్యా కేంద్రంలో బాల్యం విద్యా బోధన అభ్యాస సామగ్రి తయారీపై తలపెట్టిన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2024 - 25 ఆర్థిక సంవత్సరానికిగాను బాల్యం విద్యా కేంద్రాలలో నమోదైన 3 నుంచి 5 సంవత్సరాల వయస్సు ఉన్న విద్యార్థులకు ఆటపాటలతో కూడిన బోధన జరగాలన్నారు. కార్యక్రమంలో జివిఎంసి బాల్యం విద్యా పథకం సహాయకులు ఆవుపాటి మోహన్ కుమార్, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

కిడ్స్ గార్డెన్‌లో దసరా సంబరాలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఎంవిపి.కాలనీ, ఉషోదయ జంక్షన్ వద్దగల కిడ్స్ గార్డెన్ పబ్లిక్ స్కూల్‌లో గురువారం దసరా సంబరాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పాఠశాల చిన్నారులు దుర్గాదేవి, సరస్వతీ దేవి, కాళికాదేవి వస్త్రాలంకరణలతో సంప్రదాయకంగా విచ్చేసి అలరించారు. అనంతరం స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సాయిలక్ష్మి మాట్లాడుతూ ముందు తరాలకు మన సంస్కృతీ సంప్రదాయాలను అందించాలని తెలియజేశారు.

మనసును రంజింపజేసే కార్యక్రమాల్లో పాల్గొనాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : మానసిక రోగులు మనసును రంజింపజేసే కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా ఉపశమనం పొందవచ్చని రిటైర్డ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎన్ఎన్.రాజు అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా గురువారం సాయంత్రం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో జరిగిన సదస్సులో ఆయన ప్రధాన వక్తగా పాల్గొని మాట్లాడారు. ఈ సంవత్సర నినాదం 'వృత్తి ప్రదేశంలో మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యతనిద్దాం' అని తెలిపారు. ప్రపంచ జనాభాలో మూడో వంతు జనాభా చిన్నా చితక మానసిక చికాకులతో గడుపుతున్నవారేనన్నారు. వీరిలో ఒక శాతం తీవ్ర మానసిక వ్యాధిగ్రస్తులని గణాంకాలు తెలియజేస్తున్నాయన్నారు. అయితే వివక్ష కారణంగా బయటకు చెప్పుకోలేని అభాగ్యులు ఇంకెందరో ఉంటారన్నది కఠోర సత్యం అన్నారు. ఈ మధ్య కాలంలో మత్తు, మద్య పదార్థాల బానిసలు లెక్కకు మించి ఉన్నారని, ఆత్మహత్యల వార్తలు నిత్యకృత్యమైపోయాయని, ప్రపంచ జనాభాలో ఆత్మహత్యల్లో అగ్రస్థానం మన దేశానిదే అన్నది వాస్తవమని విచారం వ్యక్తం చేశారు. రోజు రోజుకూ పెరుగుతున్న ఒత్తిడి, విభిన్న వర్గాల్లో ఘర్షణ, ఆర్థిక, సామాజిక అంతరాలు, క్షీణించిన కుటుంబ వ్యవస్థ, దిగజారుతున్న నైతిక విలువలు ముఖ్యమైన కారణాలని చెప్పారు. వృత్తి ప్రదేశాల్లో మానసిక ఆరోగ్యాన్ని పరిరక్షణకు తీసుకోవలసిన జాగ్రత్తలను తెలియజేశారు. ప్రజారోగ్య వేదిక కార్యదర్శి కామేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి కౌసల్య కౌన్సిలింగ్ సెంటర్ నిర్దేశకులు డాక్టర్ నిహల్ వందన సమర్పణ చేశారు.

తోపుడు బండ్ల కార్మికులకు ఉపాధి రక్షణ కల్పించాలి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : మద్దిలపాలెం జాతీయ రహదారిని ఆనుకుని ఆర్‌టిసి సంస్థ గోడ పక్కన 20 సంవత్సరాల నుంచి చిల్లర వ్యాపారాలు చేసుకుంటున్న 32 మంది తోపుడు బండ్ల కార్మికులను అద్దె షాపుల పేరుతో ఆర్‌టిసి యాజమాన్యం తొలగించేందుకు చేస్తున్న ప్రయత్నం సరికాదని తోపుడు బండ్ల కార్మిక సంఘం మద్దిలపాలెం జోన్ గౌరవ అధ్యక్షులు పి.వెంకట్రావు అన్నారు. మద్దిలపాలెం హైవే సెంటర్‌లో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ హైవే ఫేసింగ్‌లో అద్దె షాపులు నిర్మించడం వల్ల ట్రాఫిక్ సమస్యలు వస్తాయని, ఇప్పటికే మద్దిలపాలెం హైవేలో ట్రాఫిక్ ఎక్కువగా ఉందని తెలిపారు. నేషనల్ హైవే పక్కన ఇష్టానుసారం షాపులు కట్టకూడదన్న నిబంధన ఏమైందని ప్రశ్నించారు. జివిఎంసి, విఎంఆర్‌డిఎ అనుమతి లేకుండా ఆర్‌టిసి యాజమాన్యం అద్దె షాపులకు వేలం వేసిందని, తక్షణం అధికారులు వీటిని తొలగించాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై స్పందించే ప్రముఖ లాయర్ పివి.గిరిధర్ మద్దిలపాలెం తోపుడుబండ్ల కార్మికుల వద్దకు వచ్చి లీగల్‌గా సహాయం అందిస్తానని హామీ ఇచ్చారు. తోపుడుబండ్ల కార్మికులకు వెండింగ్ కార్డులు ఇచ్చారని, వారిని తొలగించడం సరికాదని అన్నారు. ఆర్‌టిసి యాజమాన్యం బడా బాబులకు తక్కువ రేటుకు స్థలాలు కట్టబెట్టి.. చిన్న చిన్న చిల్లర వ్యాపారాలు చేసుకునే తోపుడుబండ్ల కార్మికులను తొలగించడం విడ్డూరంగా ఉందని అన్నారు. విశాఖపట్నం తోపుడు బండ్లు, చిల్లర వర్తకుల కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అంగుడు సింహాచలం మాట్లాడుతూ జివిఎంసి అధికారులు హాకర్ జోన్‌లో కల్పించవలసిన సౌకర్యాలను ఇంతవరకూ కల్పించలేదని, తక్షణం మంచినీరు, కరెంటు, మరుగుదొడ్డి సౌకర్యాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు సీనియర్ నాయకులు అనపర్తి అప్పారావు పాల్గొన్నారు.